సాక్షి

డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

ఆదివారం । 19 । మార్చి । 2023



అన్నదానానికి విరాళం


అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి సాగి విజయలక్ష్మి కుటుంబ సభ్యులు (గోగొన్నమఠం) శనివారం రూ.25వేలు విరాళం సమరించారు.



నిత్యాన్నదానానికి రూ.50 వేలు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో నిత్యాన్నదానానికి అడపా రామకృష్ణ, పార్వతి దంపతులు (భీమవరం) శనివారం రూ.50 వేల విరాళం సమర్పించారు.

డెల్టాలకు నీరు విడుదల



ధవళేశ్వరం: గోదావరి డెల్టా కాలువలకు శనివారం 6,880క్యూసెక్కులు విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2170,మధ్య డెల్టాకు 1410,పశ్చిమ డెల్టాకు 3300 క్యూసెక్కుల నీటిని వదిలారు.

న్యూస్‌రీల్

ఇంటర్ పరీక్షకు 12,228 మంది హాజరు

రాయవరం: జిల్లా వ్యాప్తంగా 38 కేంద్రాల్లో శనివారం ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం ఇంగ్లిషు పరీక్ష నిర్వహించారు. దీనికి 12,910 మంది విద్యార్థులకు గాను 12,228 మంది హాజరయ్యారు. 682 మంది విద్యార్థులు పరీక్ష రాయలేదు. జనరల్ విద్యార్థులు 10,850 మందికి గాను 10,302 మంది హాజరవగా 548 మంది గైర్హాజరయ్యారు. 2,060 మంది ఒకేషనల్ విద్యార్థులకు గాను 1,926 మంది పరీక్ష రాశారు. 134 మంది పరీక్ష రాయలేదు. జిల్లాలో పరీక్షలు ప్రశాంతం సాగుతున్నాయని ఇంటర్మీడియెట్ బోర్డు డీవీఈఓ ఎస్‌వీవీ సత్యనారాయణరెడ్డి తెలిపారు.

యువతిని కాపాడిన కానిస్టేబుల్‌కు అభినందన



ఏఆర్ కానిస్టేబుల్ వీరబాబును అభినందిస్తున్న ఎస్పీ సుధీర్‌కుమార్‌రెడ్డి, ఏఎస్పీ లతామాధురి తదితరులు

అమలాపురం టౌన్: ఆత్మహత్య చేసుకునేందుకు గోదావరిలో దూకిన యువతిని కాపాడిన కానిస్టేబుల్‌ను ఎస్పీ సీహెచ్ సుధీర్‌కుమార్‌రెడ్డి శనివారం అభినందించారు. పుదుచ్చేరి పరిధిలోని యానాం మున్సిపాలిటీకి చెందిన ఓ యువతి ఎదుర్లంక వంతెన పైనుంచి శుక్రవారం సాయంత్రం గౌతమీ గోదావరిలో దూకింది. అదే సమయంలో జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ (ఏఆర్) కానిస్టేబుల్ అంగాని వీరబాబు అటుగా మోటార్ సైకిల్‌పై వస్తున్నారు. యువతి దూకిన విషయాన్ని గమనించి, అప్రమత్తమైన ఆయన వెంటనే బైక్ ఆపి, నదిలో దూకి ఆమెను రక్షించి, ఒడ్డుకు చేర్చారు. ఆ యువతిని తల్లిదండ్రులకు అప్పగించారు. విషయం తెలియడంతో కానిస్టేబుల్ వీరబాబును ఎస్పీ సుధీర్‌కుమార్‌రెడ్డి శనివారం తన కార్యాలయానికి రప్పించారు. ఆయనను ప్రత్యేకంగా అభినందించి, నగదు రివార్డు అందించారు. ప్రజలు ఆపదలో, కష్టాల్లో ఉన్నప్పుడు పోలీసులు తమ వంతు స్పందిస్తారనడానికి వీరబాబు ధైర్యసాహసాలు నిదర్శమని పేర్కొన్నారు. వీరబాబును ఏఎస్పీ కె.లతామాధురి, ఏఆర్ డీఎస్పీ విజయ సారథి, ఇతర పోలీసు అధికారులు కూడా అభినందించారు.

తొమ్మిదేళ్లుగా..



వెంకన్న ఆలయంపై బొమ్మలు చెక్కుతున్న అయ్యప్ప

బొబ్బిలి అయ్యప్ప తొమ్మిదేళ్లుగా ఎన్నో ఆలయాల నిర్మాణాల్లో పాలు పంచుకుంటున్నారు. అమలాపురం వెంకన్న ఆలయంలో శిల్పిగా నాలుగు నెలలుగా పని చేస్తున్నారు. అంతకు ముందు నల్ల చెరువు వెంకన్న ఆలయంతో పాటు ముమ్మిడివరం మండలం పల్లిపాలెం ఆలయాల గోపురాల నిర్మాణాల్లో కూడా పాలు పంచుకున్నారు. అమలాపురం వెంకటేశ్వరస్వామి **ఆలయ గోపురాలను అత్యద్భుతంగా తీర్చిదిద్దారు.**

35 ఏళ్లు.. 1,200 గోపురాలు



దేవాలయాల నిర్మాణంలో 1988లో మొదలైన వెంకటేశ్వరరావు ప్రస్థానం ఇప్పటికీ అప్రతిహతంగా కొనసాగుతోంది. 1,200 దేవాలయాల నిర్మాణాల్లో ఆయన పాలు పంచుకున్నారు. తాళ్లరేవు మండలం మట్లపాలెం జీయర్ స్వామి ఆలయం వద్ద కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయం గోపురం నుంచి హైదరాబాద్, ఘట్‌కేసర్‌లలోని పలు ఆలయాల నిర్మాణాల్లో పాల్గొన్నారు. అండమాన్‌లో రామాలయం, శివాలయం, మరియమ్మ ఆలయాల గోపురాలను నిర్మించారు. వెంకటేశ్వరావు ఆధ్వర్యంలోనే యానాం – ఎదుర్లంక వారిధి వద్ద 63 అడుగుల అతి పెద్ద ఆంజనేయ స్వామి విగ్రహాన్ని నెలకొల్పుతున్నారు.

పెదిరెడ్డి వెంకటేశ్వరరావు

అమ్మవారి ఆలయ నిర్మాణం ప్రత్యేకం



వడగన శ్రీనివాస్ అమ్మవారి ఆలయాల నిర్మాణాలతో పాటు గోపురాల నిర్మాణాల్లో సిద్ధహస్తుడు. హైదరాబాద్, కర్నూలు, విజయవాడల్లో జరిగిన పలు అమ్మవారి ఆలయాలు నిర్మాణాల్లో పాలు పంచుకున్నాడు. ఈ వృత్తిని తండ్రి నుంచి వారసత్వంగా స్వీకరించాడు.

వడగన శ్రీనివాస్



ఆలయంపై ఏర్పాటు చేసిన బొమ్మలు

గుడులపై శిల్పాలు చెక్కినారు..

సండే స్పెషల్

- ఆలయ గోపురాలకు జీవం పోస్తున్న జిల్లా శిల్పులు
- అద్భుతమైన పనితనంతో నిర్మాణం
- కట్టిపడేసే రీతిలో దేవతా మూర్తుల తయారీ
- మంత్రముగ్ధులవుతున్న భక్తులు

సాక్షి, అమలాపురం: ఆలయం అంటే భక్తుల కోసం భగవంతుడు కొలువుదీరిన నిలయం. తమ మొరలాలకించి, తమను కష్టాల నుంచి గట్టెక్కించే ఆ స్వామికి, అమ్మవారికి భక్తులు ఎంతో ప్రీతితో సేవలు చేసే ప్రదేశం. అసలు ఆలయాన్ని చూడగానే మనసులో నుంచి భక్తితరంగాలు వెల్లువెత్తుతూంటాయి. ఆలయ గోపురాలపై దేవతామూర్తులను, వివిధ పురాణ ఘట్టాలను ఎంతో నైపుణ్యంగా తీర్చిదిద్దడమే ఇందుకు కారణం. దీని వెనుక చేయి తిరిగిన శిల్పుల పనితనం ఎంతో ఉంటుంది. బొమ్మలు చేసి.. ప్రాణము పోసినట్టు.. వారు ఆలయ శిఖరాలపై రకరకాల బొమ్మలను అపురూపంగా తీర్చిదిద్దుతారు. ఆ దేవతామూర్తి కళ్ల ముందు సాక్షాత్కరించినంత అందంగా వాటికి మెరుగులు అద్దుతారు. 'శిలలపై శిల్పాలు చెక్కినారు.. మనవాళ్లు సృష్టికే అందాలు తెచ్చినారు' అంటూ ఒక సినీ కవి రాసినట్టు.. 'గుడులపై శిల్పాలు చెక్కినారు.. ఆలయ శిఖరాలకు వన్నె తెచ్చినారు' అని ఈ శిల్పుల గురించి చెప్పవచ్చు.



ఆలయంపై ఏర్పాటు చేసిన బొమ్మలు

దేవాలయం అనగానే ముందుగా మన కళ్లకు కనిపించేవి ముందుగా గర్భగుడి, రాజ (గాలి) గోపురాలే. ఆలయంలో స్వామి, అమ్మవార్లు ఎవరు కొలువు తీరినా.. గాలిగోపురం మీద దేవతామూర్తులు దర్శనమీయవలసిందే. ఆలయాన్ని సందర్శించినప్పుడే కాదు.. అటుగా వెళ్తున్నప్పుడు కూడా ఈ గోపురాలను చూస్తేనే భక్తిభావం ఉప్పొంగుతుంది. వాటి వంక చూసి, క్షణకాలమైనా కళ్లు మూసుకుని దణ్ణం పెట్టడం భక్తులకు పరిపాటి. అటువంటి గోపురాలను కళ్లు తిప్పుకోలేని రీతిగా తీర్చిదిద్దడంలో జిల్లా శిల్పులది అందె వేసిన చేయి. కొత్త ఆలయాలు నిర్మించాలన్నా, పాత ఆలయాలకు కొత్త సొబగులు అద్దాలన్నా కోనసీమ శిల్పుల చేతులు పడాల్సిందే. జిల్లాకు చెందిన పెదిరెడ్డి వెంకటేశ్వరరావు (కపిలేశ్వరపురం మండలం అంగర), బొబ్బిలి అయ్యప్ప (అయినవిల్లి మండలం క్రాప), శ్రీనివాస్ (ఐ.పోలవరం మండలం టి.కొత్తపల్లి) వంటి వారు ఆలయ గోపురాలను సిమెంటుతో అత్యద్భుతంగా తీర్చిదిద్దుతారు. వందలాది ఆలయాలకు కొత్త రూపం తీసుకువస్తున్నారు. వాడపల్లి వెంకటేశ్వరస్వామి, అమలాపురం, నల్ల చెరువు వెంకన్న, సాయిబాబా ఆలయాలు, ఎ.వేమవరంలో 23 అడుగుల సుబ్రహ్మణ్యస్వామి విగ్రహంతోపాటు, 18 అడుగుల ఆంజనేయస్వామి విగ్రహాలు ఈ శిల్పుల చేతుల్లోనే రూపుదిద్దుకున్నాయి.

కోనసీమ శిల్పుల కళానైపుణ్యానికి కలికి తురాయిలా రూపుదిద్దుకుంటున్న అమలాపురం శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ గోపురాలు



తయారీకీ ఉంటుందో లెక్క

ఆలయ గోపురాల నిర్మాణం, వాటి మీద తీర్చిదిద్దే దేవతామూర్తులు, జంతువులు, ఇతర బొమ్మలను ఇష్టానుసారం తయారు చేయడానికి వీలు లేదు. సంబంధిత ఆగమ శాస్త్రాల ప్రకారం, వేద పండితుల సలహాల మేరకు వైష్ణవ, శైవ, అమ్మవారి ఆలయాల నిర్మాణాలను, బొమ్మల తయారీని చేపట్టాల్సి ఉంటుంది. గోపురం ఎత్తు, అందుకు తగినట్టుగా అంతస్తుల నిర్మాణాలు, వాటి మీద అమర్చే బొమ్మలకు సైతం లెక్కలు ఉంటాయి. 'ఆరు అడుగుల మనిషి బొమ్మను తయారు చేయాలంటే కాళ్లు, మొండెం, తల ఎంత ఎత్తు, ఎంత పొడవు ఉండాలనే లెక్క ఉంటుంది. చివరకు చేతి వేళ్లకు సైతం ఒక పరిమాణం ఉండాలి. లేకుంటే బొమ్మలో జీవం ఉండదు' అని శిల్పి అయ్యప్ప 'సాక్షి'కి తెలిపారు.

పీఎఫ్ సొమ్ము జమ

కాకినాడ సిటీ: ప్రావిడెంట్ ఫండ్ ఖాతాలకు సంబంధించి వివిధ అవసరాల కోసం దరఖాస్తు చేసుకున్న ఉద్యోగుల ఖాతాల్లో శనివారం నగదు జమ చేసినట్టు జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, ముఖ్య కార్యనిర్వహణాధికారి ఎన్‌వీవీ సత్యనారాయణ తెలిపారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రజా పరిషత్ యాజమాన్యంలో పని చేస్తూ, ఉద్యోగ విరమణ చేసిన, మరణించిన ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బందికి కూడా తుది చెల్లింపులు చేశామని మీడియాకు వివరించారు. ప్రస్తుత సిబ్బందిలో కొందరి ఆర్థిక అవసరాలకు అనుగుణంగా సొమ్ము జమ చేశామన్నారు. 1,244 మంది వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో రూ.54,93,25,447 జమ చేశామని జెడ్పీ చైర్మన్ విప్పర్తి తెలిపారు.

నైట్ వాచ్‌మన్‌కు.. రైట్‌రైట్

- ఉన్నత పాఠశాలల్లో నియమించనున్న రాష్ట్ర ప్రభుత్వం
- జిల్లాలోని 226 హైస్కూళ్ల ఆస్తులకు రక్షణ



అంబాజీపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

అమలాపురం టౌన్: మన బడి నాడు – నేడు పథకంలో పాఠశాలల ప్రగతికి ఇప్పటికే పెద్దపీట వేసిన రాష్ట్ర ప్రభుత్వం వాటి భద్రతకూ భరోసా కల్పిస్తోంది. రాష్ట్రంలోని 5,388 ఉన్నత పాఠశాలలకు రూ.6 వేల గౌరవ వేతనంతో నైట్ వాచ్‌మన్ల నియామకానికి చర్యలు చేపడుతున్నట్టు ప్రకటించడం జిల్లాలోని ఉన్నత పాఠశాలలకు తీపి కబురే కానుంది. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు విధిగా ఉండాల్సిన నైట్ వాచ్‌మన్ వ్యవస్థను గత ప్రభుత్వాలు నిర్వీర్యం చేశాయి. దాదాపు 15 ఏళ్ల తర్వాత ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత పాఠశాలల్లో నైట్ వాచ్‌మన్ల నియామకానికి చర్యలు చేపడుతోంది. దీనిపై జిల్లాలోని 226 జిల్లా పరిషత్, మున్సిపల్, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ప్రధానోపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నాడు – నేడు ఫలితంగా అనూహ్యమైన అభివృద్ధి వల్ల సమకూరిన సౌకర్యాలతో పాఠశాలల్లో ఆస్తుల విలువ కూడా పెరిగింది. ప్రతి ఉన్నత పాఠశాలలో కంప్యూటర్లు, సైన్స్ ల్యాబ్‌లు, ఫ్యాన్లు, ఆర్‌ఓ ప్లాంట్లు, ఖరీదైన ఎలక్ట్రికల్ పరికరాల వంటివెన్నో సమకూరాయి. అధునాతన సౌకర్యాలతో భవనాలు నిర్మించారు. పగలంతా ఉపాధ్యాయులు, విద్యార్థుల సందడి ఉన్నప్పటికీ రాత్రి సమయాల్లో కొన్నిచోట్ల ఆకతాయిలు, అల్లరి మూకలు చేరి పాఠశాలల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న ఘటనలు కూడా చోటు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో నైట్ వాచ్‌మన్లను నియమిస్తే తమ పాఠశాలలకు రాత్రి వేళ ఇక నుంచి భద్రత, రక్షణ ఏర్పడుతుందని చెబుతూ ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపాధ్యాయులు స్వాగతిస్తున్నారు.

త్వరలో నియామకానికి చర్యలు



ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం జిల్లాలోని 226 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో త్వరలోనే నైట్ వాచ్‌మన్ల నియామకాలకు చర్యలు చేపడతాం. నాడు – నేడు పథకం వల్ల జరిగిన అభివృద్ధి, సమకూరిన సౌకర్యాలతో పాఠశాలలకు ఇప్పుడు నైట్ వాచ్‌మన్ల నియామకం తప్పనిసరి. ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం సంతోషం.

– ఎం.కమలకుమారి, జిల్లా విద్యాశాఖాధికారి

ఇబ్బంది పడుతున్నాం



అమలాపురంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల అతి పెద్దది. నాడు – నేడు ద్వారా మా పాఠశాలకు దాదాపు రూ.కోటి నిధులతో అన్ని అధునాతన సౌకర్యాలూ సమకూరాయి. నైట్ వాచ్‌మన్ లేక రాత్రి సమయాల్లో మరుగుదొడ్లను ఆకతాయిలు అపరిశుభ్రం చేస్తున్నారు. ఇప్పుడు రాత్రి సమయంలో కాపలాదారు ఉంటే ఇతరుల ప్రవేశాన్ని అరికట్టవచ్చు.

– ఎస్.రాజరాజేశ్వరి, ప్రధానోపాధ్యాయిని, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అమలాపురం

అనుకోని అతిథిలా..



ఉప్పలగుప్తం మండలం గొల్లవిల్లిలో భారీ వర్షం

- అకాల వర్షం.. అన్నదాత హర్షం
- ఉమ్మడి జిల్లాలో ఒక మోస్తరు నుంచి భారీ వర్షం
- కోనసీమలో ఉరుములు, మెరుపులతో వాన
- లోతట్టు ప్రాంతాలు జలమయం

సాక్షి అమలాపురం: ఉపరితల ద్రోణి, ఆవర్తనాల ప్రభావంతో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో రెండో రోజైన శనివారం కూడా ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకూ పలుచోట్ల అడపాదడపా వర్షం పడినా.. రాత్రి కోనసీమ జిల్లాలో గంటకు పైగా ఏకధాటిగా భారీ వర్షం పడింది. అకాల వర్షాలతో సామాన్యులు ఇబ్బంది పడినప్పటికీ.. గోదావరి డెల్టాలో రబీ వరి, మెట్ట, మాగాణుల్లోని ఉద్యాన రైతులు మాత్రం ఈ వానలు అనుకోని అతిథిలా వచ్చాయంటూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ, తూర్పు గోదావరి జిల్లాల్లో శనివారం ఉదయం నుంచి రాత్రి వరకూ వర్షం కురిసింది. మెట్ట ప్రాంతంలో మధ్యాహ్నం ఒక మోస్తరు వర్షం పడింది. కోనసీమలో రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురవడంతో మలికిపురం, అమలాపురం ప్రాంతాల్లోని లోతట్టు ప్రాంతాలు, ప్రధాన రహదారులపై నీళ్లు చేరాయి. కేంద్ర పాలిత ప్రాంతమైన పుదుచ్చేరి పరిధిలోని యానాంలో కూడా భారీ వర్షం కురిసింది. రోడ్లు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కాకినాడ జిల్లా తాళ్లరేవులో ఎడతెరిపి లేకుండా, కాజులూరులో భారీ వర్షం కురిసింది. జగ్గంపేటలో సాయంత్రం భారీ వర్షం కురవడంతో రోడ్లు నీట మునిగాయి. తుని, ఏలేశ్వరం తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం వర్షం పడింది. యు.కొత్తపల్లి మండలం ఉప్పాడ వద్ద సముద్ర కెరటాలు ఎగసిపడుతున్నాయి. రాజమహేంద్రవరం, కాకినాడ నగరాల్లో కూడా వర్షం పడింది. తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని కొవ్వూరు, నిడదవోలు, గోపాలపురం ప్రాంతాల్లో ఉదయం నుంచీ అడపాదడపా చినుకులు పడుతున్నాయి.

రబీ వరి రైతుకు ఊరట : గోదావరి డెల్టాలో రబీ వరి రైతులకు ఈ వర్షాలు చాలా వరకూ ఊరటనిచ్చాయి. తూర్పు డెల్టాలోని శివారు మండలాలైన తాళ్లరేవు, మధ్య డెల్టాలోని ఉప్పలగుప్తం, అల్లవరం, మామిడికుదురు, మలికిపురం, సఖినేటిపల్లి, రాజోలు, అయినవిల్లి, అమలాపురం మండలాల్లో సమృద్ధిగా సాగునీరు అందని పరిస్థితి నెలకొంది. సుమారు 15 వేల ఎకరాలు నీటి ఎద్దడి బారిన పడ్డాయి. అధికారులు సమన్వయంతో సాగునీరు ఇస్తున్నా సరిపోవడం లేదు. ఇటువంటి పరిస్థితుల్లో కురిసిన భారీ వర్షం ఈ ప్రాంతాల్లోని రైతులకు ఊరటనిచ్చింది. మెరక, శివార్లలోనే కాకుండా డెల్టా, ఏలేరు ప్రాంతాల్లో వరికి తెగుళ్లు సోకుతున్న సమయంలో వర్షం కురవడంతో మేలు జరిగిందని చెబుతున్నారు. అయితే వరి చేలు ఈని, గింజ గట్టిపడుతున్న దశలో ఉన్న చేలకు నష్టం జరుగుతుందని, తాలు, తప్పలు వస్తాయని మరికొంత మంది రైతులు అంటున్నారు. వరి కోతలు ముందుగా మొదలైన రాజానగరం పరిసర ప్రాంతాల్లోని రైతులు వాన జల్లులతో హైరానా పడుతున్నారు.

ఉద్యాన పంటలకు మేలు

అకాల వర్షాలు ఉద్యాన పంటలకు కూడా మేలు చేసింది. కొబ్బరి, కోకో, ఆయిల్‌పామ్ వంటి ఉద్యాన పంటల రైతులు కూడా ఈ వర్షం వల్ల మేలు జరుగుతుందని చెబుతున్నారు. మెట్ట ప్రాంతంలోని మామిడి, జీడి మామిడి రైతులకు ఈ వర్షం మేలు చేస్తుంది. మామిడి పిందె గట్టిపడి తమకు ప్రయోజనం కలుగుతుందని గోకవరం మండలం వెదురుపాకకు చెందిన ప్రకృతి వ్యవసాయదారు కోరుపల్లి అప్పలస్వామి 'సాక్షి'కి తెలిపారు.

రాగిజావ ట్రయల్ రన్ విజయవంతం

- జిల్లా వ్యాప్తంగా 1,581 పాఠశాలల్లో అమలు
- 21న లాంఛనంగా ప్రారంభం

రాయవరం: జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాగిజావ ట్రయల్ రన్ విజయవంతమైంది. జిల్లా వ్యాప్తంగా 1,581 ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో శనివారం ఈ కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 10 గంటలకు విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్‌గా రాగిజావ అందించారు. రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 21న లాంఛనంగా ప్రారంభించనున్న నేపథ్యంలో అధికారులు ఈ ట్రయల్ రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎక్కడా ఎటువంటి లోటుపాట్లకూ తావు లేకుండా ఉండేందుకే దీనిని చేపట్టారు. ఈ నెల 20న కూడా మరోసారి ట్రయల్ రన్ నిర్వహిస్తారు. అనంతరం 21 నుంచి విద్యార్థులకు పూర్తి స్థాయిలో రాగి జావ పంపిణీ చేపడతామని అధికారులు తెలిపారు. విద్యార్థులు కూడా రాగిజావను ఇష్టంగా తీసుకున్నారని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం మధ్యాహ్న భోజన పథకం అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ) నక్కా సురేష్ తెలిపారు. ద్రాక్షారామలో రాగిజావ ట్రయల్ రన్‌ను పాఠశాల విద్యాశాఖ ఆర్‌జేడీ జి.నాగమణి పర్యవేక్షించారు. జావ రుచి చూసి, సంతృప్తి వ్యక్తం చేశారు.



ద్రాక్షారామలో విద్యార్థులతో కలిసి రాగిజావ తీసుకుంటున్న ఆర్‌జేడీ నాగమణి

సాగు, తాగునీటి సమస్యలపై నిర్దిష్ట ప్రణాళిక

- అధికారులకు జెడ్పీ చైర్మన్ ఆదేశం
- కాకినాడలో స్థాయీ సంఘాల సమావేశాలు



స్థాయీ సంఘాల సమావేశాల్లో పాల్గొన్న జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు

కాకినాడ సిటీ: వేసవిలో సాగు, తాగునీటి సమస్యల నివారణకు నిర్దిష్ట ప్రణాళికలు అమలు చేయాలని అధికారులను జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు ఆదేశించారు. జెడ్పీ కార్యాలయంలో శనివారం స్థాయీ సంఘాల సమావేశాలు జరిగాయి. ఇందులో జెడ్పీ చైర్మన్ విప్పర్తి, వైస్ చైర్మన్ బుర్రా అనుబాబు, వివిధ స్థాయీ సంఘాల సభ్యులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. వివిధ అంశాలకు సంబంధించి పురోగతి, కొత్తగా ప్రతిపాదించిన పనులు, జెడ్పీటీసీ సభ్యులు లేవనెత్తిన అంశాలపై సంబంధిత అధికారులు తీసుకున్న చర్యలపై చర్చించారు. ఏడు స్థాయీ సంఘాల సమావేశాలు ఆయా సంఘాల చైర్‌పర్సన్ల అధ్యక్షతన జరిగాయని విప్పర్తి తెలిపారు. ప్రధానంగా గ్రామీణ నీటి సరఫరా, రహదారులు, వ్యవసాయం, విద్య, వైద్యం, పంచాయతీరాజ్ తదితర అంశాలపై చర్చించామన్నారు. వ్యవసాయానికి సంబంధించి చివరి ఎకరాకు సైతం నీరందేలా కృషి చేస్తున్నామని వెల్లడించారు.

సాగు, తాగునీటి సరఫరాకు సంబంధించి గ్రామీణ నీటి సరఫరా, వ్యవసాయం, ఇరిగేషన్ శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని చైర్మన్ వేణుగోపాలరావు ఆదేశించారు. గ్రామాల్లోని మంచినీటి ట్యాంకులన్నింటినీ శుభ్రపరచి, నీటితో నింపాలన్నారు. సాగునీటి కాలువల్లో ప్రవాహం సక్రమంగా ఉండేందుకు కాలువలను శుభ్రం చేయాలని అధికారులను ఆదేశించారు. వచ్చే నెలలో జరిగే పదో తరగతి పరీక్షలకు సంబంధించి ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని విప్పర్తి సూచించారు. కాకినాడ టౌన్ రైల్వేస్టేషన్ సమీపాన ఉన్న జిల్లా పరిషత్ కల్యాణ మండపం అందరికీ అందుబాటులో ఉండేలా గతంలో ఉన్న అద్దెను సవరించామని తెలిపారు. సవరించిన ధరతో కూడిన కరపత్రాన్ని చైర్మన్ వేణుగోపాలరావు, జెడ్పీ సీఈవో ఎన్‌వీవీ సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యులు కలిసి విడుదల చేశారు.

ఇంకా ఏం చర్చించారంటే..

- వ్యవసాయ శాఖపై జరిగిన సమీక్షలో జెడ్పీ వైస్ చైర్మన్, వ్యవసాయ స్థాయీ సంఘం చైర్మన్ బుర్రా అనుబాబు మాట్లాడారు. మూడో పంటగా అపరాలు, పచ్చిరొట్ట సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. అన్ని రైతుభరోసా కేంద్రాల్లో 50 శాతం సబ్సిడీపై రైతులకు అవసరమైన విత్తనాలు అందిస్తున్నామన్నారు.
- స్త్రీ, శిశు సంక్షేమం స్థాయీ సంఘ చైర్‌పర్సన్ రొంగల పద్మలత అధ్యక్షతన జరిగిన సమావేశంలో అంగన్‌వాడీ భవనాల నిర్మాణం, చిన్నారులకు పౌష్టికాహారం సరఫరా, నాణ్యత తదితర అంశాలపై సభ్యులు, ఐసీడీఎస్ అధికారులతో చర్చించారు. అధికారులు పలు సంక్షేమ పథకాలను వివరించారు.
- తాగునీటి కొరత ఉన్న ప్రాంతాల్లో ట్యాంకర్లతో తాగునీరు సరఫరా చేస్తామని జిల్లా పంచాయతీ అధికారి ఆర్.విక్టర్ తెలిపారు. గ్రామాల్లో పారిశుధ్య వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు కుక్కల బెడద నియంత్రణకు చర్యలు చేపడతామని చెప్పారు.
- సమావేశంలో డ్వామా పీడీ ఎ వెంకటలక్ష్మి, డిప్యూటీ సీఈఓ ఎ.రమణారెడ్డి, ఏఓ ఎం.బుజ్జిబాబు, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పు గోదావరి, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు చెందిన వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

81 ఇంటర్ పరీక్ష కేంద్రాల్లో తనిఖీలు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం)/అమలాపురం టౌన్: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా 140 కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని ప్రాంతీయ ఇంటర్మీడియెట్ బోర్డు అధికారి (ఆర్ఐఓ) ఎస్ఎస్‌వీఎల్ నరసింహం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం జరిగిన సెకండియర్ ఇంగ్లిషు పరీక్షకు జనరల్ విభాగంలో 40,364 మందికి గాను 39,119 మంది విద్యార్థులు హాజరయ్యారని, 1,245 మంది పరీక్ష రాయలేదని తెలిపారు. అలాగే ఒకేషనల్ విభాగంలో 4,638 మందికి గాను 4,384 మంది హాజరయ్యారని, 254 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 81 పరీక్షా కేంద్రాల్లో స్క్వాడ్‌లు తనిఖీ చేశాయని, ఒక మాల్ ప్రాక్టీస్ కేసు నమోదైందని తెలిపారు. విద్యార్థుల రైటింగ్ ప్యాడ్స్‌పై సబ్జెక్టుకు సంబంధించిన, ఇతర రాతలు ఉంటే అనుమతించబోమని నరసింహం స్పష్టం చేశారు.



ప్రత్యేక అలంకరణలో వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి



భక్తులతో పోటెత్తిన వెంకన్న ఆలయం

కోనసీమ తిరుపతి.. భక్తజన గోదారి

- వేంకటేశ్వరుని దర్శించిన 40 వేల మంది భక్తులు
- వాడపల్లిలో ప్రతిధ్వనించిన గోవింద నామస్మరణ
- రూ.16.96 లక్షల ఆదాయం

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శనివారం భక్తజన గోదారే అయ్యింది. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి ప్రీతికరమైన శనివారం, ఏకాదశి పర్వదినం, స్వామి వారి నక్షత్రం శ్రవణం కలిసి రావడంతో వేలాదిగా భక్తులు ఆలయానికి తరలివచ్చారు. గోవింద నామస్మరణతో వాడపల్లి పరిసరాలు ప్రతిధ్వనించాయి. బస్సులు, సొంత వాహనాలపై దాదాపు 40 వేల మంది భక్తులు ఆలయానికి చేరుకున్నారు. గౌతమీ గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి, స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. వేకువజాము నుంచే వాడపల్లి చేరే రహదారి భక్తులు, వారి వాహనాలతో కిక్కిరిసిపోయింది. స్వామి వారిని బుల్లితెర నటుడు తోట జానకిరామ్ (జాకీ) దర్శించుకున్నారు. ప్రత్యేక దర్శనం, అన్నప్రసాద విరాళాలు, వివిధ సేవలు, లడ్డూ ప్రసాద విక్రయాలు, ఇతర విరాళాల రూపంలో స్వామి వారికి రూ.16,96,093 ఆదాయం సమకూరిందని ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.



స్వామి వారి సన్నిధిలో బుల్లితెర నటుడు జాకీ

వైభవంగా అధ్యయనోత్సవాలు ప్రారంభం

శ్రీ వేంకటేశ్వరస్వామి వారి వార్షిక తిరు కల్యాణోత్సవాలు త్వరలో జరగనున్న నేపథ్యంలో వేద పండితులు ఆలయంలో అధ్యయనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. అధ్యయనోత్సవాల్లో భాగంగా ఆళ్వారుల విగ్రహాల వద్ద వేద పండితులు వేద పఠనం చేస్తూ స్వామివారి ఆరాధనా కార్యక్రమాలు నిర్వహించారు. దివ్య ప్రబంధ పారాయణ, బాలభోగం, నివేదన, నీరాజన మంత్రపుష్పాది పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ నెల 31 నుంచి వారం రోజుల పాటు జరగనున్న స్వామి వారి కల్యాణోత్సవాల్లో భాగంగా అధ్యయనోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని ఈఓ సత్యనారాయణరాజు చెప్పారు.

మేడపై నుంచి పడి విద్యార్థికి గాయాలు

- హాస్టల్‌లో తోటి వారే తోసేశారని ఫిర్యాదు
- ఆమే పడిపోయిందంటున్న సహచర విద్యార్థినులు

అయినవిల్లి: తనను తోటి విద్యార్థులు మేడ పైనుంచి తోసేశారని ముక్తేశ్వరంలోని ఓ నర్సింగ్ కళాశాల విద్యార్థిని శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలు బూసి పల్లవి, ఎస్సై ఎస్.నాగేశ్వరరావు కథనం ప్రకారం.. కొత్తపేట మండలం పలివెలకు చెందిన ఆమె కళాశాలలో నర్సింగ్ మొదటి సంవత్సరం చదువుతోంది. అదే కళాశాల హాస్టల్‌లో ఉంటోంది. ఇటీవల తాము బ్యాగ్‌లో దాచుకున్న నగదు పోతోందంటూ ఆమెతో చదువుతున్న ఎనిమిది మంది విద్యార్థినులు శుక్రవారం రాత్రి హాస్టల్ నిర్వాహకులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో నిర్వాహకులు అందరి బ్యాగ్‌లతో పాటు పల్లవి బ్యాగ్ కూడా వెతికారు. శనివారం ఉదయం బ్రష్ చేసుకుంటూండగా ఆ ఎనిమిది మంది విద్యార్థినులూ తనను వెనుక నుంచి మేడపై రెండో అంతస్తు నుంచి గెంటేశారని పల్లవి చెబుతోంది. అయితే తోటి విద్యార్థులు మాత్రం శుక్రవారం రాత్రి కళ్లు తిరుగుతున్నాయని పల్లవి చెప్పిందని, అనంతరం వాంతులు కూడా చేసుకుందని అంటున్నారు. తమ బ్యాగ్‌లో దాచుకున్న నగదు పోవడం వాస్తవమని, ఆ డబ్బులు తానే తీసినట్టు పల్లవి ఒప్పుకుందని చెబుతున్నారు. ఆమే కళ్లు తిరిగి మేడ పైనుంచి పడిందని అంటున్నారు. పల్లవికి మూడుచోట్ల ఎముకలు విరిగాయని వైద్యులు చెబుతున్నారు. కళాశాల నిర్వాహకులు ఆమెను అమలాపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం పల్లవి తల్లిదండ్రులు రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పల్లవి ఫిర్యాదు మేరకు ఎస్సై ఎస్.నాగేశ్వరరావు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఆస్పత్రిలోని వైద్యులకు పల్లవి రెండు విధాలుగా స్టేట్‌మెంట్ ఇచ్చినట్టు చెబుతున్నారు.



అమలాపురం ఏరియా ఆస్పత్రిలో పల్లవి

విశ్రాంత ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం

అమలాపురం టౌన్: జిల్లాలోని రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు అమలాపురంలోని ఆఫీసర్స్ క్లబ్ భవనంలో తొలిసారిగా శనివారం సమావేశం నిర్వహించుకుని నూతన కార్యవర్గం ఏర్పాటు చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్‌కు అనుబంధంగా అడ్‌హాక్ కమిటీ ఏర్పాటు చేశారు. దీనికి వ్యవస్థాపక అధ్యక్షునిగా జేఎన్ఎస్ గోపాలకృష్ణ, కార్యదర్శిగా చిక్కం ప్రసాద్, కోశాధికారిగా ఏవీ సత్యనారాయణరాజు, అసోసియేట్ అధ్యక్షునిగా ఎస్‌వీ నాయుడు, ఉపాధ్యక్షులుగా ఎస్.మోహనరావు, రంకిరెడ్డి కాశీ, సంయుక్త కార్యదర్శులుగా ఎం.గౌతమేశ్వరరావు, కమిటీ సభ్యులుగా కోట రామమోహనరావు, జొన్నలగడ్డ కృష్ణారావు, చౌదరి, రాజు ఎన్నికయ్యారు. సంఘం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు కె.పద్మనాభం, కార్యదర్శి పీఎస్ఎస్ఎన్‌పీ శాస్త్రి, కోశాధికారి ఎండీ ఇబ్రహీం ఆధ్వర్యంలో ఈ ఎన్నికలు జరిగాయి. నూతన కార్యవర్గాన్ని ఉమ్మడి జిల్లా సంఘ ప్రతినిధులు అభినందించి, సత్కరించారు.



రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం